

రాష్ట్రస్థాయి పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల పరిధిలోని ఆదర్శ పాఠశాల విద్యార్థినిలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ తెలిపారు. కొత్త చెరువులో జరిగిన జిల్లా స్థాయిలో స్కిల్ డెవలప్ మెంట్ పోటీలలో హిందూపురం మండలంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు అపారల్ ట్రేడ్ లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు శిక్షకులు కె. సుబ్రహ్మణ్యం తెలిపారు. పాఠశాలకు చెందిన పి. ఓ. అరుణ, కె. ఎన్. దీప్తి, ఎన్. దివ్య, శరణ్య (509), శరణ్య(611), నందు ప్రియ, వైష్ణవి, తేజస్వి, పి.శతి, పూజ తదితర విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అమరా రమేష్ బాబు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు. రాష్ట్రస్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరచాలని ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

ఉద్యోగమూ లేదు.. భృతీ లేదు..!

♦17 నెలలైనా అమలుకు నోచని హామీ ♦నోరు మెదపని కూటమి పాలకులు
♦వర్క్ ఫ్రం హోం పేరుతో వివరాల సేకరణ ♦ఊసే లేని జాబ్ క్యాలెండర్



ప్రజాశక్తి-పెనుకొండ

అధికారంలోకి వస్తే యువతకు 20 లక్షల ఉద్యోగాలిస్తాం.ఉద్యోగం వచ్చే వరకూ నెలకు రూ.3వేల భృతి చెల్లిస్తాంజ ఇది కూటమి ప్రభుత్వ పాలకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ. అయితే ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం విస్మరించింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరి 17 నెలలైనా దాని ఊసే ఎత్తడం లేదు. మూడు నెలలక్రితం వర్క్ ఫర్ హోం అంటూ నిరుద్యోగుల వివరాలు సేకరించిన ప్రభుత్వం నేటికీ వర్క్ చూపలేదు. ఉద్యోగాల కోసం నిరుద్యోగులకు ఎదురు చూపులు తప్పడం లేదు. ఎంటెక్, బీటెక్, డిగ్రీ ఇతర వృత్తి విద్య కోర్సులను చేసిన నిరుద్యోగులు ఉద్యోగాల కోసం కర్నాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు పరుగులు పెడుతున్నారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామన్న ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడం లేదు. ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం చొరవ చూపడం లేదంటూ నిరుద్యోగులు విమర్శలు గుప్పిస్తున్నారు.

జిల్లాలో చదువుకున్న యువత వివరాలు

పీజీ, ఎంటెక్ చేసిన వారు:36,090, డిగ్రీ, బీటెక్, బీఎడ్ కోర్సులు చేసిన వారు: 93,000, టీటీసీ సమానమైన కోర్సులు చేసిన వారు:18,009, వృత్తి విద్య, ఐటీఐ కోర్సులు చేసిన వారు: 33,012, ఇతర విద్యా వంతులు: 1,13,000

నోరు మెదపని కూటమి పాలకులు

ఇంటికో ఉద్యోగం.. అంతవరకూ నిరుద్యోగభృతి అంటూ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఊరూరా ప్రచారం చేశారు. నమ్మి అధికారం కట్టబెట్టిన యువతను పాలకులు వంచించారు. జిల్లాలో ఇంటర్ సమానమైన వృత్తి విద్య, డిగ్రీ, పీజీ, బీటెక్ తదితర కోర్సులు పూర్తి చేసిన యువతీ యువకులు దాదాపు మూడు లక్షల మంది ఉన్నారు. ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై దృష్టి సారించలేదు. జిల్లాలో భూమి, నీటి వనరులు ఉన్నప్పటికీ ఒక్క కొత్త పరిశ్రమనూ స్థాపించలేదు. ప్రభుత్వం నుంచి తీపి కబురు వస్తుందేమోనని ఎదురుచూస్తున్న యువతకు నిరాశే ఎదురవుతోంది. ఉద్యోగాల భర్తీ గురించి.. నిరుద్యోగభృతి చెల్లింపు గురించి పాలకులు నోరు మెదపడం లేదు.

గత ప్రభుత్వంలో సచివాలయ ఉద్యోగాలు మాత్రమే

గత ప్రభుత్వం తొలి రెండేళ్లలోనే 4 లక్షల సచివాలయ ఉద్యోగాలు భర్తీ చేసి సరిపెట్టింది. వాలంటీర్లు నియమించి లక్షల ఉద్యోగాలు ఇచ్చామంటూ ప్రచారం చేసుకుంది. కూటమి ప్రభుత్వం ఉపాధి కల్పన దిశగా ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. కనీసం యువతకు నిరుద్యోగ భృతి కూడా చెల్లించలేదు. అధికారంలోకి రావడం కోసం హామీలు ఇచ్చి.. తర్వాత విస్మరించడం పట్ల ప్రభుత్వంపై యువత అసంతృప్తి వ్యక్తం చేస్తోంది.

మెగా డిఎస్సీతో సరిపెట్టారు

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేయగానే మెగా డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేశారు. 16 నెలలకు డీఎస్సీ పూర్తిచేసి 15వేలకు పైగా ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో జాబ్ కాలెండర్ ప్రకటించి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తారని యువత ఆశపడింది. ఏళ్ల గడుస్తున్న నిరుద్యోగులకు ఉద్యోగాలు లేక ప్రభుత్వ ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.

జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి ఏటా జాబ్ కాలెండర్ ప్రకటించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని విస్మరించింది. ఇంటికో ఉద్యోగం లేకపోతే ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన ప్రతి నిరుద్యోగికీ నెలకు రూ.3 వేల భృతి అందిస్తామని కూటమి నాయకులు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాది కాలం దాటినా ఉద్యోగాలు ఇవ్వలేదు. భృతి ఇవ్వలేదు. ఒత వరకు ఆ హామీ అమలు గురించే పట్టించుకోకపోవడం దారుణం.

నామాల నాగార్జున,
ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి



పరుగుపందెం పోటీల్లో పాల్గొన్న రెవెన్యూ ఉద్యోగులు



షాట్‌పుట్ పోటీల్లో మహిళా రెవెన్యూ ఉద్యోగి

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...

రెండోరోజు కొనసాగిన రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

స్థానిక ఆర్డీటీ క్రీడామైదానంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా రెండోరోజు శనివారం జరిగిన క్రీడాపోటీల్లో క్రీడాకారులు ఉల్లాసంగా.. ఉత్సాహంగా పాల్గొన్నారు. శనివారం రెండవ రోజు ఆర్డిటి స్టేడియంలో జరిగిన వివిధ క్రీడలను ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, డిఆర్ఒ మలోల, రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, కార్యదర్శి వెంకట రాజేష్, జిల్లా అధ్యక్షులు దివాకర్ తదితరులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలు క్రీడలకు టాస్ వేసి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను ఉత్తేజపరుస్తూ క్రీడల విధివిధానాలను పాటించి విజయం సాధించాలని సూచించారు. అనంతరం మాంఛోఫెర్రర్ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా రాయలసీమ ప్రాంతంలోని అనంతపురం లాంటి కరువు జిల్లాలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సహకారాలతో ప్రభుత్వ యంత్రాంగం క్రీడలను సాంస్కృతిక కార్యక్రమాలను ఆర్టీటీ మైదానంలో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి క్రీడాకారుడు జాతీయస్థాయి పోటీలను లక్ష్యంగా నిర్దేశించుకొని ఆడాలని రెవెన్యూ ఉద్యోగులకు సూచించారు. ఒక వైపు ఉద్యోగం చేసుకుంటూ మరోవైపు క్రీడల్లోనో రాణించాలని క్రీడల వల్ల శారీరక దఢత్వంతో పాటు మానసిక దఢత్వం లభిస్తుందని తెలిపారు. గతంలో ఎన్నడు లేనివిధంగా ఇలాంటి కార్యక్రమాలు ఆర్డీటీ స్టేడియంలో జరుపుకోవడం స్ఫూర్తిదాయకమన్నారు. క్రీడల్లో పాల్గొన్న అన్ని జిల్లాల రెవెన్యూ ఉద్యోగులకు ఆయన అభినందించారు. ఈ సందర్భంగా టేబుల్ టెన్నిస్‌లో అనంతపురం జిల్లాలో విన్నర్‌గా నిలబెట్టిన ఎఫ్ఎస్ఒ రామకష్ణారెడ్డిని ప్రత్యేకంగా అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జునుడు, ఆనంద్, రామ్మోహన్, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దివాకర్ రావు, కార్యదర్శి సోమశేఖర్, స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సంజీవరెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, సత్యసాయి జిల్లా అధ్యక్షులు మధు నాయక్, కార్యదర్శి మైనుద్దీన్, మీడియా ఇన్చార్జి మునివేలు తదితరులు పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ క్రీడా పోటీల్లో ఉద్యోగులు చురుకుగా పాల్గొని తమ ప్రతిబా నైపుణ్యాలను ప్రదర్శిస్తూ క్రీడా స్ఫూర్తిని పెంపొందించారు.



రెవెన్యూ ఉద్యోగ సంఘం నాయకులు, ఉద్యోగులతో ఆర్డీటీ పోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్

11న సివిల్‌సప్లయ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభ



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

కరపత్రాలను విడుదల చేసిన సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

అనంతపురం జిల్లాలో ఈనెల 11న సివిల్ సప్లయ్ వర్కర్స్ యూనియన్ మహాసభలను నిర్వహిస్తున్నట్లు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి ఓబులు తెలిపారు. కామ్రేడ్ నాగరాజు అధ్యక్షతన జిల్లా సివిల్ సప్లై వర్కర్స్ యూనియన్ సమావేశం పుట్టపర్తిలో శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఓబులు మాట్లాడుతూ ఈనెల 11న అనంతపురం జిల్లాలో 11న సివిల్ సప్లయ్ వర్కర్స్ యూనియన్ మహాసభలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతపురం జిల్లాలో జరుగుతున్న రాష్ట్ర మహాసభ కు ప్రతి పాయింట్ నుంచి ఇద్దరు చొప్పున హాజరుకావాలని ఆయన కోరారు. మనుషులు మారుతున్నారే తప్ప ప్రభుత్వాల విధానాలు మారలేదని అన్నారు. నిరంతరం ప్రజలకు ఆహార ధాన్యాలు సరఫరా చేసే కార్మికులకు సంక్షేమ చట్టాలు అమలు చేయాలని కోరుతున్నా పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. మృతిచెందిన కార్మికులకు పరిహారం ఇవ్వడం లేదని అన్నారు. 11న నిర్వహించే మహాసభలో కార్మికుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని ఓబులు తెలిపారు. ఆనంతరం సివిల్‌సప్లయ్ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను నాయకులు విడుదల చేశారు.

11న జాబ్ మేళా

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ సూచనల మేరకు ఈ నెల 11వ తేదీన అంబికా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళల కోసం ప్రత్యేకంగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న మహిళలకు సహకారం అందించాలని ఉద్దేశంతో ఈ జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హిందూపురం పట్టణంలోని మహర్షి వాల్మీకి కళ్యాణమండపంలో ఈ జాబ్ మేళా జరుగుతుందన్నారు. టాటా ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా మహిళల సాధికారతను దృష్టిలో ఉంచుకుని ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా మహిళలకు స్థిరమైన ఉద్యోగం, భద్రమైన వాతావరణం, మంచి వేతనం కలిగిన అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ పూర్తి చేసిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఎంపికైన యువతులు బెంగళూరు సమీపంలోని హోసూరులో జూనియర్ టెక్నీషియన్లు గా పనిచేయాల్సి ఉంటుందన్నారు. రూ. 19,128 వేతనంతో పాటు ఉచిత బస్ సౌకర్యం, ఉద్యోగస్థలానికి రాకపోకలు, ఉచిత భోజన సౌకర్యం, కంపెనీ ఆధ్వర్యంలో నివాస సదుపాయం, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు ఉంటాయన్నారు. 18 నుండి 30 సంవత్సరాల మధ్య ఉన్న మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాల కోసం వివరాల కోసం 91219 73876, 81438 52543 సంప్రదించాలని, అర్హత, ఆసక్తి ఉన్న యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అంబిక లక్ష్మీనారాయణ సూచించారు.

స్టీల్ పరిశ్రమలపై విజిలెన్స్ తనిఖీలు

రెండు పరిశ్రమలకు రూ. 10 లక్షలు జరిమానా



స్టీల్ పరిశ్రమలో తనఖీల కోసం వెళుతున్న విజిలెన్స్ అధికారులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం తూముకుంట, గోళాపురం పారిశ్రామిక వాడలో ఉన్న స్టీల్ పరిశ్రమలపై ఉమ్మడి జిల్లా ప్రాంతీయ నిఘా అధికారి ప్రసాద్ ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారి జమాల్ భాష నేతృత్వంలో వాణిజ్యపన్నుల శాఖ అధికారులు, తూనికల, కొలతల అధికారులు, పొల్యూషన్ బోర్డ్ అధికారులు, లేబర్ ఆఫీసర్, ఎలెక్ట్రిక్ సేఫ్టీ డిపార్ట్మెంట్ అధికారులు శుక్రవారం రాత్రి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గోళాపురం పారిశ్రామిక వార్డులో ఉన్న కుబేర స్టీల్ అండ్ పవర్ ఎల్ ఎల్ పి, మైయిశీ ఫెర్రో ఎల్ ఎల్ పి స్టీల్ పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించారు. తనిఖీలో భాగంగా ఫ్యాక్టరీ అనుమతి పత్రాలను, భౌతిక నిల్వలను, ఇతర రిజిస్టర్లను పరిశీలించారు. తూనికల, కొలతల అధికారులు ద్వారా గుర్తించిన లోపాలపై ఒక్కొక్క ఫ్యాక్టరీ యజమానికి లీగల్ మెట్రోలజీ యాక్ట్ 2009 ప్రకారం రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.10 లక్షలు జరిమానా విధించినట్లు విజిలెన్స్ అధికారి జమాల్ బాషా తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం పరిశ్రమలకు సంబంధించిన పలు రికార్డులను సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ తనిఖీలలో ఐఒపిబి సురేష్ కుమార్, వాణిజ్యపన్నుల శాఖ అధికారులు కృష్ణవేణి, శ్రీనివాసులు, పోతులయ్య, ఇండస్ట్రీస్ డిపార్ట్మెంట్ అధికారులు మురళీకృష్ణ, సంజీవరాజు, తూనికల, కొలతల శాఖ అధికారులు శివశంకర్, పొల్యూషన్ బోర్డ్ అధికారులు కృష్ణారెడ్డి, కార్మిక శాఖ అధికారి లేబర్ శేఖర్ బాబు, ఎలెక్ట్రిక్ సేఫ్టీ డిపార్ట్మెంట్ అధికారులు సురేష్ బాబు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాని, సిఎం పర్యటనకు పటిష్ట భద్రత



ప్రధాని, సిఎం పర్యటన ఏర్పాట్లపై ట్రస్టు సభ్యులతో చర్చిస్తున్న కలెక్టర్, ఎస్పీ

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సత్యసాయి శత జయంతి ఉత్సవాలలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలకు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ తోపాటు ఎస్పీ సతీష్ కుమార్ ఇతర అధికారులు ప్రధాని, ముఖ్యమంత్రి ప్రశాంతి నిలయంలో బస చేసే ప్రదేశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అదనపు ఎస్పి అంకిత సూరన్ మహావీర్, సత్యసాయి మేనేజింగ్ ట్రస్టు ఇతర అధికారులు పాల్గొన్నారు. పీఎం, సీఎం, ఉప ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులు పాల్గొననున్న నేపథ్యంలో సత్యసాయి విమానాశ్రయం, లాంజ్ లు, హిల్ వ్యూ స్టేడియం, సాయి కుల్వంత్ హాలు, మొదలైన ప్రదేశాల్లో చేయాల్సిన ఏర్పాట్లు భద్రత చర్యలపై అధికారులతో కలెక్టర్, ఎస్పీ విస్తృతంగా చర్చించారు. అదేవిధంగా ఎన్‌టి చౌదరి లేఅవుట్లలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. పీఎం పర్యటన మార్గం, సత్యసాయి మహా సమాధి దర్శనం, స్టేడియంలో జరిగే కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించారు. వీఐపీల వాహనాల పార్కింగ్, ట్రస్టుకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు, ప్రజా నియంత్రణ పై చర్చించారు. అధికారులందరూ ప్రణాళిక బద్ధంగా పీఎం, సీఎం, పర్యటనలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు సువర్ణ, వివిఎస్ శర్మ, మహేష్, ఆనంద్ కుమార్, ఆర్‌టిఒ కరుణ సాగర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్, డిఇ నరసింహ, తహశీల్దారు కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

కరువు కనబడలేదు !

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వానికి కరువు కనబడలేదు. అనంతపురం జిల్లాలో ఒక్క కరువు మండలం కూడా ప్రకటనవలేదు. సత్యసాయి జిల్లాలో కొన్ని మండలాలు కరువు మండలాల జాబితాలోనున్నప్పటికీ అనంతపురం జిల్లాలో మాత్రం కరువు ఈ ఏడాది లేనట్టుగానే ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ద్వారా స్పష్టమవుతోంది. వాస్తవానికి ఈ సీజన్ ప్రారంభమైన జూన్ నుంచే వర్షాభావం నెలకొంది. జులైలోనూ అదే పరిస్థితి కొనసాగింది. ఒక్క ఆగస్టు నెలలో మాత్రం వంద శాతం వరకు అధిక వర్షపాతం నమోదయింది. ఆ తరువాత సెప్టెంబరులోనూ వర్షాభావమే కొనసాగింది. వర్షాధారం కింద సాగయ్యే పంటలకు సాధారణంగా సకాలంలో వర్షాలు పడాల్సి ఉంటుంది. అందులోనూ విత్తనం విత్తుకునే సమయంలో మంచి పదును కావాలి. జిల్లాలో విత్తనం విత్తుకునే జులై మాసంలో తీవ్ర వర్షాభావం నెలకొంది. ఈ ప్రభావం ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణంపైనా పడింది. ఆగస్టు వరకు 50 శాతం కూడా పంటలు సాగవలేదు. ఆగస్టులో పడిన వర్షాలకు ప్రధాన పంట వేరుశనగ కాకుండా ఇతర పంటలు సాగు చేసుకున్నారు. ప్రధాన పంట వేరుశనగ సాగుకు సిద్ధమైన రైతులు విత్తనం విత్తుకోకుండా నష్టపోయారు. ఆ తరువాత ఆగస్టులో పడిన వర్షాలకు ఇతర పంటలు సాగు చేసినప్పటికీ సాగు లక్ష్యం కంటే రెండు లక్షల ఎకరాలు తక్కువగానే పంటలు సాగు చేశారు. అంటే రెండు లక్షల ఎకరాలు ఖరీఫ్‌లో బీడుగానే ఉండిపోయింది. సరైన వర్షపాతం లేకపోవడం వలనే పంటలను రైతులు సాగు చేసుకోలేకపోయారు. సాగుచేసిన రైతులకు కూడా సరైన వర్షాల్లేక నష్టపోయే పరిస్థితి వచ్చింది. అయితే ప్రభుత్వం ఆగస్టులో పడిన అధిక వర్షం కూడా కలిపి కరువు మండలాల ప్రకటనలో లెక్కించడంతోనే జిల్లాలో ఒక్క మండలం కూడా కరువు మండలాల జాబితాలో చోటు దక్కన్నట్టు తెలుస్తోంది. దీనిపై రైతు సంఘాలు, విపక్ష పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సరైన సమయంలో వర్షాల్లేక రైతులు నష్టపోయారని చెబుతున్నారు. గతేడాది కూడా ఇదే రకంగా జిల్లాకు నష్టం జరిగిందన్న వాదనలు వినిపిస్తున్నారు. కేవలం ఏడు మండలాలు మాత్రమే కరువు మండలాలు ప్రకటించేసింది.దీనికి కూడా ఇన్‌పుట్ సబ్సిడీ ఇంత వరకు విడుదల చేయలేదు. వాతావరణ బీమా పరిస్థితి ఏమిటన్న అయోమయం ఇంకా కొనసాగుతోంది,. ఇలా ఈ వారంలో కరువు మండలాల ప్రకటన ప్రధాన చర్చ నడుస్తోంది. ఇంత జరుగుతున్నా ప్రజాప్రతినిధులు మాత్రం దీనిపై పెదవి విప్పడం లేదు. కరువు మండలాల ప్రకటనలో ఏమి జరిగిందన్న దానిపై సమీక్ష జరిపిన దాఖలాల్లేవు. ఇక ఈ వారంలో రెవెన్యూ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రీడలకు అనంతపురం వేదికైంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చి ఎంతో ఉత్సహపూరిత వాతావరణంలో జరుగుతున్నాయి. ఆదివారంతో ఈ ఉత్సవాలు ముగియనున్నాయి. ఈసందర్భంగా రాష్ట్ర స్థాయి రెవెన్యూ అధికారులు



పెద్దఎత్తున పాల్గొంటారు. ఇక కళ్యాణదుర్గంలో రెండు రోజులపాటు విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ విచ్చేశారు. కనకదాసు విగ్రహావిష్కరణ చేపట్టారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ వారంలో రాష్ట్రమంతా పెద్దఎత్తున వర్షాలు పడినప్పటికీ జిల్లాలో మాత్రం తక్కువగా పడింది. రబీలోనూ పంటల సాగు ఆశించినంత గా జరగడం లేదు. రబీ ప్రధాన పంట పప్పుశనగ సాగు విస్తీర్ణం కూడా తక్కువగానే ఉంది. సబ్సిడీ విత్తనం పంపిణీ ఇప్పుడు ఆరంభమైంది.

ప్రజాశక్తి
www.prajasakti.com

స్వచ్ఛ హిందూపురానికి చర్యలు

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్



హిందూపురంలోని మొత్కుపల్లి డంప్ యార్డులో కమిషనర్‌కు సూచనలు ఇస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి రామ్


ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంతో పాటు మూడు మండలాల పరిధిలో ఉన్న అన్ని గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి రామ్ అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి రామ్, డైరెక్టర్లు పర్వీన్ బాను, మంజునాథ్, భవాని రవి కుమార్, మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్, టిడిపి కో ఆర్డినేటర్ శ్రీనివాస్ రావు, బాలయ్య పీఏలు వీరయ్య, బాలాజీ, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునతో కలిసి పట్టణంలోని మోత్కుపల్లి వద్ద ఉన్నా పాత డంపింగ్ యార్డులో జరుగుతున్న రీసైక్లింగ్ పనులను, గుడ్డంపల్లి వద్ద నూతన డంపింగ్ యార్డులను పరిశీలించారు. ప్రతి పంచాయతీలోనూ కంపోస్ట్ యార్డులను సద్వినియోగం చేసుకొని సంపదసృష్టికి శ్రీకారం చుట్టాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ లో ర్యాంకును మరింత మెరుగుపరిచే విధంగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో మున్సిపల్ అధికారులతో పాటు నియోజక వర్గ వ్యాప్తంగా మండల పరిషత్ అధికారులు, గ్రామీణ నీటి పారుదల శాఖ, పర్యావరణ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి, పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎంఈ దస్తగిరి, ఇతర ఇంజనీయర్లు, ఎంపిడిఓ ఆనంద్ ప్రసాద్, డిప్యూటీ ఎంపిడిఓ శశి కుమార్, గ్రామీణ నీటి పారుదల శాఖ ఇంజనీయర్లు వేణు, దివ్యతో పాటు ఇతర అధికారులు, పలువురు కౌన్సిలర్లు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మడకశిర నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తాం

మడకశిరటౌన్ : మడకశిర నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని స్వచ్ఛాంధ్ర కార్పొ రేషన్ చైర్మన్ పట్టాభిరామ్ తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన ఎమ్మెల్యే ఎంఎస్.రాజుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 62 గ్రామ పంచాయతీలకు స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా నిధులు అత్యధికంగా ఖర్చు చేసి అభివృద్ధికి సహకరిస్తామన్నారు. నగర పంచాయతీలో ఇంటింటి చెత్త సేకరణకు 4 విద్యుత్ వాహనాలు మంజూరు చేస్తామన్నారు. రోడ్డు డివైడర్లలో గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేసి పట్టణాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. చెత్త ప్లాస్టిక్ సేకరణ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. డంపింగ్ యార్డ్‌లో రెండెకరాలను అభివృద్ధి చేసి అత్యంత సుందరమైన పార్కు నిర్మిస్తామన్నారు. మండలానికి ఓ స్వచ్ఛరథం, ప్రతి పంచాయతీకి చెత్త సేకరించే ట్రై సైకిళ్లు అందజేస్తామన్నారు. శివపురం గుట్టలో సామూహిక మరుగుదొడ్ల ఏర్పాటుకు అధికారులు డిపిఆర్ సిద్ధం చేశారని, వెంటనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా అవసరం మేరకు కమ్యూనిటీ, వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేస్తామన్నారు. కమ్యూనిటీ భవనాలు ఏర్పాటు చేయాలని యాదవ కులస్తులు కోరగా పట్టాభి సానుకూలంగా స్పందించారు.

ఘనంగా కనకదాసు జయంతి



పెనుకొండలో కనకదాసు జయంతి సభలో మాట్లాడుతున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

కురుబల ఆరాధ్య దైవం భక్త కనకదాసు 538వ జయంతి వేడుకలను శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా మంత్రి సవిత కురుబ సామాజిక వర్గం ప్రజలు, కూటమి శ్రేణు లతో కలిసి ర్యాలీగా వెళ్లి కనకదాసు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం భక్త కనకదాసు జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ శాశ్వత జీవో విడుదల చేయడం హర్షణీయమన్నారు. కురుబలకు ఇచ్చిన హామీ నెరవేర్చిన సిఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, నాయకులు పాల్గొన్నారు. అలాగే బహుజన చైతన్య వేదిక అధ్యక్షులు శివరామకృష్ణ కనకదాసు విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఆయన మాట్లాడుతూ కుల వివక్ష కారణంగా ఉడిపి శ్రీకృష్ణ ఆలయ ప్రవేశానికి నిరాకరించడంతో తన భక్తి గానంతో శ్రీకృష్ణుని సైతం తన వైపు తిప్పుకున్న మహా భక్తుడు కనకదాసు అని తెలిపారు. కనకదాసు గొప్ప సంఘసంస్కర్త, వాగ్గేయకారుడు అన్నారు. అంతటి గొప్ప వ్యక్తిని సమాజం ఆదర్శంగా తీసుకొని ఆయన మార్గంలో పయనించాలని తెలిపారు. కార్యక్రమంలో వేదిక గౌరవాధ్యక్షులు యంగ్ ఇండియా వెంకటేశులు, సలహాదారు బాబుప్రసాద్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, కోశాధికారి రామాంజనేయులు, ఆంద్రూస్, లక్ష్మనాయక్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : సమాజంలో చైతన్యం కోసం విశేష కృషి చేసిన మహోన్నత వ్యక్తి భక్త కనకదాసు అని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. కురుబ సంఘం ఆధ్వర్యంలో బుక్కపట్నంలో కనకదాసు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పల్లె కనకదాసు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కురుబలు గురవయ్యల విన్యాసాలతో కనకదాసు చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు.

హిందూపురం : స్థానిక వైసిపి కార్యాలయంలో కనకదాసు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, నాయకులు వేణురెడ్డి, శివ, తదితరులు కనకదాసు చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు కురుబ సంఘం ప్రతినిధులు, వైసిపి నాయకులు కార్యకర్తలు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. శ్రీ కనకదాసు జయంతి వేడుకలను టిడిపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ ముందు ఉన్న కనకదాసు విగ్రహానికి పూలమాల లు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ డి.ఈ. రమేష్ కుమార్, ఎమ్మెల్యే పిఎలు శ్రీనివాసరావు, బాలాజీ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ, టిడిపి కౌన్సిలర్లు, కురుబ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో భక్త కనకదాసు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై కనకదాసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ కనకదాసు తన కీర్తనలు, రచనల ద్వారా సమాజంలో అసమానతలు, కులవ్యవస్థపై పోరాడి ప్రజల్లో చైతన్యం తెచ్చారన్నారు. సామాజిక రుగ్మతల నిర్మూలనకు ఆయన సేవలు శ్లాఘనీయమన్నారు. మానవత్వపు విలువలే అత్యున్నతమని చాటి చెప్పారన్నారు. కార్యక్రమంలో సిఐలు రాఘవన్, మోహన్, ఆర్ఐలు వలి, మహేష్, రవికుమార్, ఆర్ఎస్ఐలు, ఎఆర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



6 ఇంచిల వెట్‌మిక్స్ స్థానంలో మూడు ఇంచిల వెట్‌మిక్స్ వాడుతున్న దృశ్యం

నాసిరకంగా రోడ్డు నిర్మాణం!

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండలంలోని చిలమత్తూరు పంచాచతీలో జాతీయ రహదారి-544ఈ నుంచి తుమ్మలకుంట వరకూ రూ. 45 లక్షల వ్యయంతో వేస్తున్న సీసీ రహదారిని నాసిరకంగా నిర్మిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా 6 ఇంచిల వెట్ మిక్స్ వాడాల్సి ఉండగా 3 ఇంచిల వెట్‌మిక్స్ వేసి రోడ్డు నిర్మిస్తు న్నారు. సాధారణంగా 6 ఇంచిల వెట్ మిక్స్ వేసి రోలింగ్ చేసి దానిని 3 నుంచి 4 ఇంచిలకు తీసుకు రావాలన్నది నిబంధన. అయితే అధికార పార్టీ అయిన టిడిపికి చెందిన ఓ కాంట్రాక్టర్ కాసులకు కక్కుర్తి పడి 3 ఇంచిల వెట్‌మిక్స్ వేసి రోలింగ్ చేయడంతో అది 2 ఇంచిలకు వచ్చింది. ఇదే కాకుండా కేవలం లాభార్జనే ధ్యేయంగా చాలా నిబంధనలకు తూట్లు పొడుస్తూ రోడ్డు నిర్మిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఈ విషయమై పంచాయత్ రాజ్ జెఈని వివరణ కోరగా రోడ్డు ఎక్కడ ఎలా వేయాలో మీకు తెలియదు, మాకు తెలుసు అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. మీరు పర్యవేక్షించిన ఫొటోలు పంపండి అని కోరగా ఈ రోజు హాలిడే, రేపు పంపిస్తానని సమాధానం ఇచ్చారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్లయ్య



సమావేశానికి హాజరైన సచివాలయ ఉద్యోగులు

ప్రజాశక్తి-కొత్తచెరువు

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్లయ్య, ఎపి జెఎసి జిల్లా ప్రధాన కార్య దర్శి పద్మనాభరావు, జిల్లా అధ్యక్షులు చౌడప్ప డిమాండ్ చేశారు. స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం సచివాలయ ఉద్యోగుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ప్రారంభమైనప్పటి నుంచి ఉద్యోగులు చిత్తశుద్ధితో పని చేస్తూ ప్రభుత్వ సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. అయితే అర్హులకు ఇంక్రిమెంట్ల మంజూరు, విధుల నిర్వహణలో జాబ్‌చార్ట్ ఉపయోగించకపో వడంతో పని ఒత్తిడితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్ని కేటగిరీల ఉద్యోగులకు ఉద్యోగన్నతులు, బదిలీల ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రతి సచివాలయ ఉద్యోగికి ప్రభుత్వమే ఫోన్, సిమ్‌కార్డు అందజేయాలన్నారు. పండుగ రోజుల్లో సెలవులు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఉద్యోగి సమస్యను పరిగణలోకి తీసుకుని 12వ వేతన సంఘం ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతి మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 3 డిఎలు, 11వ వేతనం బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చంద్రశేఖర్, విశ్వనాథ్, నాగరాజు నాయక్, భార్గవ్‌చౌదరి, రవికుమార్, సలీం, విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణ, గోవర్ధన్, లక్ష్మీనారాయణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మూన్నెళ్లుగా అందని 'ఉపాధి' బిల్లులు

కూలీలకు భారమైన కుటుంబ పోషణ

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో భాగంగా పనులు చేసిన శ్రామికులకు 3 నెలలుగా బిల్లులు అందలేదు. దీంతో కుటుంబ పోషణ భారమై కూలీల కుటుంబాలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటు న్నాయి. మండల వ్యాప్తంగా సుమారు 6వేలకు పైగా పేద ప్రజలు ఉపాధి హామీ పనులు చేసి బిల్లుల కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది ప్రారంభం నుంచి బిల్లుల మంజూరు విషయంలో తీవ్రమైన జాప్యం జరుగుతుండడంతో కుటుంబ పోషణ కూడా కష్టతరంగా మారిందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు సకాలంలో అందకపోవడంతో పాటు బిల్లులకు అవసరమైన నిధుల విడుదలలో కూడా తీవ్రంగా జాప్యం జరుగుతుండడంతో మండలంలోని దాదాపు సగం గ్రామాల్లో ఇప్పటికే పేద ప్రజలు ఉపాధి పనులకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. గతంలో ఉపాధి పనులు చేసిన వారంలోపే బిల్లులు పడేవని, తద్వారా కుటుంబ పోషణ సజావుగా సాగేదని గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా మారిందని కూలీలు వాపోతున్నారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని అధికారులను అడిగితే అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే కానీ తమ బాధలు అర్థం చేసుకోడం లేదని పేర్కొంటున్నారు. ఈ ఏడాది వర్షాలు కూడా ఆశించిన స్థాయిలో కరవకపోవడంతో పొలాల్లో మట్టి పని చేయాలంటే చాలా కష్టంగా ఉందని, అయినా రెక్కలు ముక్కలు చేసుకుని పనులు చేసినా నెలలు తరబడి బిల్లులు చెల్లించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఉపాధి కూలీలకు వెంటనే బిల్లులు అందించేలా చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ



అమరాపురం మండలం గునేహళ్లిలో సంతకాలు సేకరిస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి-చిలమత్తూరు

సిఎం చంద్రబాబు స్వప్రయోజనాల కోసమే ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ చేస్తున్నారని ఆ పార్టీ నేత వేణురెడ్డి విమర్శించారు. మండలంలోని చాగలేరు గ్రామంలో శనివారం వైసిపి మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రచ్చబండ, కోటిసంతకాల సేకరణ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వేణురెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభు త్వం తక్షణమే వైద్య కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసం హరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కులశేఖర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం : మండలంలోని గునేహళ్లి గ్రామంలో వైసిపి పంచాయతీ అధ్యక్షులు గొర్రె రవీంద్ర ఆధ్వర్యంలో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్యఅతిథిగా ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణ వల్ల పేదలకు వైద్యం, పేద పిల్లలకు వైద్య విద్య దూరం అవుతుందన్నారు. వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మనందరం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామం లో ప్రజలకు కరపత్రాలు అందజేసి సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు త్రిలోక్‌నాథ్, ఎంపీపీ ఈరన్న, నాయకులు నరసింహమూర్తి, చిత్తన్న, వెంకటరమణ, శశికుమార్, రవీంద్ర, తిప్పేస్వామి, సిదేశ్వర, మంజునాథ, జె.మంజునాథ్, మురళి, నంజుండ, సిద్దేశ్, చిన్నప్ప, రాజా, మంజన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

జెడిఎ రామునాయక్



పంటలను పరిశీలిస్తున్న జెడిఎ, అధికారులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఫర్టిలైజర్స్ షాపుల్లో రైతులకు ఎరువులు, పురుగుమందులు అధిక ధరకు అమ్మితే కఠిన చర్యలు తప్పవనిజిల్లా వ్యవసాయ అధికారి బి.రాము నాయక్ హెచ్చరించారు. ఆయన శనివా రం మండలంలోని పెడపల్లి గ్రామంలో పర్యటిం చారు. ముందుగా గ్రామంలో రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. అనంతరం ఎరువుల దుకాణాలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. రైతులకు ఎరువులు, పురుగు మందులను ప్రభుత్వం నిర్ణయించిన ధరకే అమ్మాలని సూచించారు. దుకాణం ముందు నిల్వ, ధరల పట్టిక ప్రదర్శించాల న్నారు. అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట ఎఇఒ ఆనంద్ నాయక్, రైతు సేవా కేంద్రం సిబ్బంది ధనుంజయ పాల్గొన్నారు.



వైసిపి ప్రజాఉద్యమం పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉషశ్రీ, నాయకులు

వైసిపి ప్రజాఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ

పెనుకొండ టౌన్ : రాష్ట్రంలో వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ప్రజా ఉద్యమానికి పిలుపు నిచ్చిందని మాజీ మంత్రి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ తెలిపారు. ఆమె శనివారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఆ పార్టీ శ్రేణులతో కలిసి 'వైసిపి ప్రజా ఉద్యమం' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ చేయడాన్ని తప్పు పట్టారు. ప్రభుత్వం పేదలకు వైద్యం, పేద పిల్లలకు వైద్య విద్యను దూరం చేస్తోందన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైసిపి అధినేత జగన్ ఆదేశాలు మేరకు చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు పొగాకు రామచంద్ర, మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

గుడిబండ : గుడిబండలో వాల్మీకి సామాజిక వర్గం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహాన్ని ఈ నెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు ఆవిష్కరించనున్నారు. దీంతో శనివారం గుడిబండ టిడిపి నాయకులు జనార్ధన్, వాల్మీకి సంఘం నాయకులు మడకశిర వెళ్లి ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిని మర్యాదపూర్వకంగా కలిసి విగ్రహావిష్కరణ కార్యాక్రమానికి ఆహ్వానించారు.

ఆర్‌డిటి ఆధ్వర్యంలో ఆర్ట్ ఫెస్టివల్

ముదిగుబ్బ : స్థానిక ఆర్‌డిటి ఫీల్డ్ ఆఫీస్‌లో శనివారం ఏరియా లెవెల్ ఆర్ట్ ఫెస్టివల్ నిర్వహించారు. ఇందులో ఆర్‌డిటి సంస్థ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. వారికి రంగోలి, హ్యాండ్ రైటింగ్, పిక్చర్ పెయింటింగ్, మట్టితో నమూనా తయారు చేయుట, న్యాచురల్ కొలేజ్, ఓరిగామి(పేపర్ కటింగ్) అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎటిఎల్ కృష్ణ, కౌన్సిలర్ పర్వీన్, సిఓలు కీర్తి, శ్రీరాములు, రమణప్ప, సిబిటిలు నారాయణస్వామి, సునీత, వెంకటేష్‌నాయక్, రమేష్‌నాయక్, దీప్లానాయక్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితునికి ఆర్థికసాయం

రొద్దం: రోడ్డు ప్రమాద బాధితునికి స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూప్ సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. ఓ ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి గతంలో రొద్దంలో చాలా ఏళ్ల ఉపాధ్యాయునిగా పని చేసి విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పారు. ఉద్యోగ విరమణ పొందిన ఆయన ప్రస్తుతం హిందూపురంలో నివాసం ఉంటున్నారు. ఆయన చిన్న కుమారుడు శ్రీనివాసరావు వృత్తిరీత్యా లారీ డ్రైవర్. గత జనవరిలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో అతడు కాలు పూర్తిగా విరిగి పోయింది. వారి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకొన్న హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూపు సభ్యులు శనివారం హిందూపురం వెళ్లి రూ. 11,500 అందజేసి పరామర్శించారు. మరికొందరు ఫోన్‌పే ద్వారా ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో రొద్దం ఉపాధ్యాయులు రంగనాథరాజు, ఆనందరాజు, అశ్వర్థనారాయణ, ఫణీంద్ర(టీచర్, పాతర్లపల్లి), హరీష్‌రావు, రాజశేఖర్ (సెరికల్చర్ డిపార్ట్మెంట్), తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాసరావుకు ఆర్థిక సాయం అందజేసుతన్న హెల్పింగ్‌హ్యాండ్ ్స గ్రూపు సభ్యులుల



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన రొద్దం పాఠశాల విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

రొద్దం : జిల్లా స్థాయిలో శనివారం నిర్వహించిన ఒకేషనల్ స్కిల్స్ డెవలప్మెంట్ పోటీల్లో మండలంలోని రొద్దం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు హెచ్‌ఎం లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. పోటీల్లో పదో తరగతికి చెందిన అగ్రికల్చర్ విద్యార్థులు హర్షిణి, అనుష్క, ఆదర్శ, అజయ్‌కుమార్, సోయబ్, 9వ తరగతి విద్యార్థి అజయ్ ప్రతిభ చాటి మొదటి స్థానంలో నిలిచి, రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ట్రైనర్ నీలిమ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం, తదితరులు అభినందించారు.

నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

లేపాక్షి : మండలంలోని కొండూరు జడ్పీ హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీ లకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు శేషగిరి బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు శివకుమార్ తెలిపారు. వారు శనివారం పాఠశాలలో మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీ అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయి నెట్ బాల్ పోటీల్లో నాని(పదో తరగతి), నిహారిక, నవ్య(9వ తరగతి), నరేంద్ర(7వ తరగతి) అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరి ఎంపిక పట్ల హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

రాష్ట్ర స్థాయిలో బిందుప్రియ ప్రతిభ

కొత్తచెరువు : 'సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ ది బెనిఫిట్ ఆఫ్ మాన్ కైండ్' అంశంపై నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కిట్ పోటీల్లో స్థానిక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి బిందుప్రియ ప్రతిభ కనబరిచి బహుమతి సాధించిందని హెచ్‌ఎం నూర్జహాన్ తెలిపారు. బిందుప్రియ గతంలో ఇక్కడ జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై అక్కడ కూడా ప్రతిభ చాటిందన్నారు. విద్యార్థినితో పాటు గైడ్ టీచర్‌గా వ్యవహరించిన ఫిజికల్ సైన్స్ టీచర్ లీలావతిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు



రాష్ట్రస్థాయి స్కిట్ పోటీలో ప్రతి చాటిన విద్యార్థులు

వివేకానంద డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే



విద్యార్థినుల నృత్యం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని వివేకా నంద డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. సీనియర్ల ప్రథమ సంవత్సరం విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన 'పరిచయ్-2025' స్వాగత కార్యక్రమానికి కళాశాల ఛైర్మన్ గండికోట చిన్నపరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏటా కొత్త విద్యార్థులు అపార ప్రతిభతో కళాశాలకు వస్తారని వారిని తమ మేధాశక్తితో అధ్యాపకులు మరింత ప్రతిభావంతు లుగా మలుస్తున్నారన్నారు. అందుకే తమ కళాశాలలో ప్రతి ఒక్కరూ 'బండిల్ ఆఫ్ టాలెంట్'ను కలిగి ఉంటారని తెలిపారు. కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువు తో పాటు అన్ని రంగాల్లో రాణించినప్పుడే ప్రస్తుత పోటీ ప్రపంచంలో విజయం సాధిస్తామన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. అనంతరం విద్యార్థులు జానపద, సినిమా పాటలకు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకు న్నాయి. కార్యక్రమంలో డైరెక్టర్ బాలం లక్ష్మీనారాయణరెడ్డి, ప్రిన్సిపల్ కరణం హర్షవర్ధన్, ఇన్‌ఛార్జి రమేష్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శికి పరామర్శ

రొద్దం : ఎపి ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ షుగర్ వ్యాధితో బాధపడుతూ తిరుపతిలోని స్విమ్స్ హాస్పిటల్‌లో చేరారు. అయితే ఆయనకు ఆపరేషన్ చేసి కాలి వేళ్లు తొలగించారు. ఆ తర్వాత ఆయన హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయి మండలంలోని నారనాగేపల్లిలో ఉన్న తన నివాసంలో విశ్రాంతి పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకొన్న టిడిపి నాయకులు శనివారం ఆ గ్రామం వెళ్లి రామకృష్ణను పరామర్శించారు. వారిలో నారాయణ, హెచ్.నాగరాజు, స్టోర్ డీలర్ కె.చంద్రమౌళి, అశ్వర్థప్ప, వెంకటేష్ ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం

బుక్కపట్నం : స్థానిక ప్రధాన రహదారిలో శనివారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గ్రామానికి చెందిన రామాంజనేయులు బార్బర్ షాప్ పూర్తిగా కాలిపోయింది. కుల వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న తరుణంలో షాపు ఇలా కాలిపోవడంతో జీవనోపాధి కోల్పోయానని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిని కలిసిన నాయకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సత్యనారాయణను శనివారం గోరంట్ల మండల ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన రోడ్డు మార్గాన అనంతపురం నుంచి బెంగళూరు వెళ్తున్న తరుణంలో పాలసముద్రం వద్ద చరిత్రకారుడు మైనాస్వామి, ఒడిగేపల్లి సర్పంచి నరసింహమూర్తి, పాలసముద్రం సింగిల్‌విండో అధ్యక్షులు చంద్ర, మాజీ సర్పంచి నిడిమామిడప్ప, టిడిపి నాయకులు మనోహర్, బాలరాజు, హరీష్‌రెడ్డి, పాలసముద్రం మూర్తి ఆయనను కలిసి శా లువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మండల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

గుడిబండ : మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన పలు వైసిపి కుటుంబాలు శనివారం మడకశిర పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టిడిపిలో చేరాయి. గొల్లపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు చిత్తనగిరి యప్ప, చిత్తయ్య, రంగస్వామి, మురళీధర్, చిత్రలింగప్ప, కరియన్న, కరియప్ప, ఈరన్న, చంద్రశేఖర్, కుమార్‌తో పాటు 10 కుటుంబాలు ఆ పార్టీని వీడి టిడిపిలో చేరగా ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వారికి పసుపు కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, మడకశిర నగర పంచాయతీ ఛైర్మన్ నరసింహారాజు సింగిల్‌విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప, నాయకులు నాగరాజు, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిపోతున్న కలప..!

రొద్దం : కొందరు స్వార్థపరులు యథేచ్ఛగా చెట్లను నరికి కలపను అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తు న్నారు. వీరిని అరికట్టడం అటవీ శాఖ అధికారులు విఫలమయ్యారని స్థానికులు విమర్శిస్తున్నారు. మండలంలోని కంబాలపల్లి గ్రామంలో పెద్ద పెద్ద చెట్లను నరికి కలపను టాటా ఏస్ వాహనంలో లోడ్ చేసుకొని కర్నాటకకు తరలిస్తూ కనిపించారు. వీరి కొందరు మండల నాయకులు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. మండల వ్యాప్తంగా ప్రతిరోజూ ఎక్కడో ఓ చోట చెట్లు నరికి కలపను అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు సమాచారం. ఇకనైనా పోలీసు, అటవీ శాఖల అధికారులు స్పందించి వారిని కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అక్రమంగా తరలిస్తున్న కలప

మహిళ ఆత్మహత్య

ధర్మవరం రూరల్ : కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగా లేకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలు.. పట్టణంలోని సాయినగర్‌లో యుగంధర్, యశోద(36) దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఓ కుమా రుడు, కుమార్తె సంతానం. యశోద బత్తలపల్లి ఆర్‌డిటి ఆసుపత్రిలో నర్సుగా పని చేసేది. ఇటీవలి కాలంలో వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగా లేకపోవడంతో మనస్తాపం చెందిన యశోద శనివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలిసిన వెంటనే వన్ టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

ముదిగుబ్బ : మండలంలోని అడవిబ్రాహ్మణపల్లి తండాకు వెళ్లే మార్గంలో శనివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో తండాకు చెందిన రమేష్‌నాయక్, శంకర్‌నాయక్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.